పాఠశాలలకు వరం పీఎంశ్రీ

- ఐదేళ్లపాటు బడులకు ఊతం
- నరసన్నపేటలో నాలుగు స్కూల్స్ ఎంపిక
- గత ప్రభుత్వంలో నాడు–నేడుతో అభివృద్ధి



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శాంతారావు తదితరులు

నరసన్నపేట: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫండ్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఈ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో గత రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

నరసన్నపేట నియోజకవర్గంలో..

పీఎంశ్రీ పథకం అమలుకు నిర్దేశించిన 46 అంశాల ఆధారంగా నరసన్నపేట నియోజకవర్గంలో నాలుగు స్కూల్స్ గుర్తించి గతేడాది నవంబర్‌లో విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. గ్రామీణ పాఠశాలల్లో 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీకి ఎంపిక చేశారు. నియోజకవర్గంలో నరసన్నపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరవంజ, ఈదులవలస మోడల్ స్కూల్స్‌ను ఎంపిక చేశారు. ఈ స్కూల్స్‌లో పనులు ప్రారంభం అయ్యాయి.

నరసన్నపేటలో ఎంపికైన స్కూల్స్

మండలం	స్కూల్	విద్యార్థుల సంఖ్య
జలుమూరు	కరవంజ మోడల్ స్కూల్	958
నరసన్నపేట	ప్రభుత్వ ఉన్నత పాఠశాల	470
సారవకోట	బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	648
పోలాకి	ఈదులవలస మోడల్ స్కూల్	700

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు ఇప్పటికే నాడు–నేడు పథకం ద్వారా సమూలంగా మారిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు, డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపడతారు.

రూ.కోటితో అభివృద్ధి

ఈ పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. విద్యా బోధన, సదుపాయాల్లో నాణ్యతా ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చుతారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, వికలాంగులకు ర్యాంపులు, ప్రధానంగా క్రీడా మైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. ఏఏ స్కూల్లో ఏఏ సదుపాయాలు ఉన్నాయి. మరే సదుపాయాలు కల్పించాలి అని పరిశీలించి దాని ప్రకారం నిధులు మంజూరు చేస్తున్నారు. గరిష్టంగా రూ.కోటి ఒక్కో స్కూల్‌కు వచ్చే అవకాశం ఉంది. దీంట్లో భాగంగా అన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. స్కూల్స్‌లో ఉన్న క్రీడా మైదానం ఆధారంగా కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్‌తో పాటు విద్యార్థుల ఆసక్తి, పీడీల సూచనలతో కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు.

మరిన్ని సదుపాయాలు



మా స్కూల్లో 470 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే నాడు–నేడు కింద స్కూల్లో అనేక సదుపాయాలు మెరుగు పడ్డాయి. తాజాగా పీఎంశ్రీతో స్కూల్ మైదానం అభివృద్ధి చేస్తున్నారు. వివిధ క్రీడా కోర్టుల నిర్మాణానికి నిధులు వచ్చాయి. అలాగే కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మించనున్నారు. మండలంలో గుర్తింపు పొందిన స్కూల్లో ఒకటైన ఈ స్కూల్‌ను పీఎంశ్రీకి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– పైడి వెంకటరావు, హెచ్‌ఎం, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

దశలవారీగా నిధులు



పీఎంశ్రీతో స్కూల్స్‌లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపడతాయి. క్రీడా మైదానాలతో పాటు సైన్స్ ల్యాబ్‌లు ఇతర సదుపాయాలు కల్పించబడతాయి. వీటి పర్యవేక్షణ అంతా ఎంఈవోలు చూస్తుంటారు. స్కూల్స్‌కు పీఎంశ్రీ ఒక పెద్ద వరమనే చెప్పాలి. పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోనున్నాయి. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుంది.

– యు.శాంతారావు, ఎంఈవో, నరసన్నపేట

క్లుప్తంగా

రూ.1.20 కోట్లతో మల్టీపర్పస్ సెంటర్లు



పనులు పరిశీలిస్తున్న డీఈఈ కోటయ్య

పాతపట్నం: నియోజకవర్గంలో పాతపట్నం, కొసమాల(మెళియాపుట్టి), గొప్పిలి పీఏసీఎస్ పరిధిలోని మూడుచోట్ల మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని మార్కెట్ శాఖ డీఈఈ ఈ.కోటయ్య తెలియజేశారు. పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ భవనాలు పూర్తయితే ఒక్కో భవనంలో రైతులు 500 మెట్రిక్ టన్నుల వరకు స్టోరేజ్ చేసుకోవచ్చునన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి వద్ద స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. క్రికెట్ ఆడుతూ మరణించిన యగళ్ల సంతోష్‌తో పాటు మరో క్రికెటర్ కోల త్రినాథ్‌ల జ్ఞాపకార్థం టీఎంపీఎల్ పేరిట నిర్వహిస్తున్న టోర్నీని ఎంపీపీ ఆరంగి మురళి ప్రారంభించారు. విన్నర్, రన్నర్ టీములకు ఆకర్షణీయమైన బహుమతులు ఉంటాయని నిర్వాహకులు శివకుమార్, అనిల్, వాసు, తవిటినాయులు తెలిపారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలి



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు గ్రేస్‌శాంతి

హిరమండలం: ప్రత్యేకావసరాల పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఫిజియోథెరపిస్టు గ్రేస్ శాంతి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటివద్ద తల్లిదండ్రులు కూడా సాధన చేస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఫిజియోథెరపీ చేయడం ద్వారా కొంత మెరుగైన స్థితి సాధించవచ్చన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కేశవరావు, ఐఆర్టీ ఉపాధ్యాయులు సీతం నాయుడు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక దుక్క రాజన్నరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు అందించడానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. బోధన సిబ్బంది దీనిపై దృష్టి సారించాలని, విద్యార్థులతో కలసి భోజనం చేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో ఉన్న తాగునీటి ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ పద్మావతి, డీటీ రాము తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో హెచ్.కె.కామాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంట్లో కేశవలస ఆయా పోస్టు ఎస్సీ, కోదడ్డపనస ఆయా పోస్టు ఎస్టీ కేటగిరికి కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు ఈనెల 10వ తేదీ 5 గంటల్లోగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొత్తూరు: కొత్తూరు ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు స్థానిక సీడీపీవో విమల కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిరమండలం మండలంలోని పూనిపేట మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు బీసీ–ఏకు, మన్మన్‌మాన్ గూడ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టు ఎస్టీలకు, మూర్తిమానుగూడ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టు ఎస్టీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. కొత్తూరు మండలం అడ్డాయిగూడ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టు ఎస్టీలకు కేటాయించినట్లు చెప్పారు. ఆయా పోస్టులకు ఏడో తరగతి అర్హత ఉండాలన్నారు. వయస్సు 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు మించకూడదన్నారు. రిజర్వ్ చేసిన కేటగిరి అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల దరఖాస్తులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం

బాలికల విద్యతోపాటు మహిళల హక్కుల కోసం తపించిన మొదటి మహిళా ఉపాధ్యాయినిగా దేశవ్యాప్తంగా కీర్తి గడించిన సావిత్రి బాయి పూలే జీవితం ప్రతి మహిళకు ఆదర్శవంతమని వక్తలు పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: పాత పొనుటూర యూపీ పాఠశాలలో టీచర్‌ను సన్మానిస్తున్న దృశ్యం



హిరమండలం: కేజీబీవీలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌వో కృష్ణవేణి, విద్యార్థులు



ఆమదాలవలస: డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాతపట్నం: మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం వైకుంఠరావు



కొత్తూరు: మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈవో గోవిందరావు తదితరులు



జలుమూరు: లింగాలవలస పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



నరసన్నపేట: సత్యవరం పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు



పొందూరు: తోలాపి పాఠశాలలో ఉపాధ్యాయినికి సత్కారం చేస్తున్న సిబ్బంది



పాతపట్నం: ఎంఆర్‌సీ ఆవరణలో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం



మెళియాపుట్టి: సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తదితరులు



హిరమండలం: పిండ్రువాడ కాలనీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్‌ఐగా హైమావతి



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా బి.హైమావతి బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో సోంపేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బాలరాజు ఆమదాలవలస స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హైమావతి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు.

7 మద్యం బాటిళ్లు పట్టివేత

బూర్జ: మండలంలోని లచ్చయ్యపేట గ్రామ జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది మాటువేసి చాకచక్యంగా 7 మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఏబీసీపేట గ్రామానికి చెందిన గురుగుబెల్లి శ్రీనివాసరావును పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ హెచ్‌సీ పి.వి.రమణ కేసు నమోదు చేశారు. నిందుతుడిని ఆమదాలవలస కోర్టులో హాజరుపరిచారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గోవిందరావు ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎర్ర చెరువును ఆయన పరిశీలించారు. చెరువు ఎంతవరకు ఆక్రమణలకు గురయ్యిందో తెలుసుకోవాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వివరాలను ప్రిన్సిపాల్, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ కిరణ్ కుమార్, డివిజనల్ సర్వేయర్ జనార్దనరావు, మండల సర్వేయర్ రామగణపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తూరు: మండలంలో పనిచేస్తున్న వీర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గిరిషీ కుమార్ పట్నాయక్ , ఉపాధ్యక్షుడిగా బమ్మిడి కూర్మారావు, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.రాజగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా జి.విజయబాబు, సంయుక్త కార్యదర్శులుగా వి.నారాయణరావు, జి.ఉమారాణి, ఎం.గోవిందరావు, కోశాధికారిగా వి.బాలకృష్ణ, సలహాదారులుగా డి.వెంకటరమణ, బి.తిరుపతిరావు, సభ్యులుగా తొమ్మిది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

అధ్వానం



సారవకోట మండలంలోని అర్లి టోల్‌గేట్ నుంచి అర్లి గ్రామానికి వెళ్లే రహదారి ఒకవైపు పూర్తిగా అధ్వానంగా మారి రాళ్లు తేలుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రయాణికులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– సారవకోట

మంచు దుప్పటి



గిరిజన ప్రాంతమైన పాతపట్నంతో పాటు పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఐదు రోజుల క్రితం పాతపట్నంలో 18 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత ఉండగా, ప్రస్తుతం 11 డిగ్రీలకు తగ్గింది. రాత్రి వేళల్లో మంచు విపరీతంగా కురుస్తుండడంతో దారి కనిపించడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు. ఉదయం 10.15 గంటల వరకు చలి తగ్గడం లేదు. మళ్లీ మధ్యాహ్నం 4 గంటలకే శీతల గాలులు వీస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

– పాతపట్నం

భక్తిశ్రద్ధలతో పూజలు



సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని లక్ష్మీ నరసింహ స్వామిగా శుక్రవారం అలంకరించారు. ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

– సారవకోట

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే, కేజీబీవీలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలకు మున్సిపల్ ఏఈలను పిలిపించి వారానికి ఒకసారి పారిశుద్ధ్య సిబ్బందిని జ్యోతిరావు పూలే పాఠశాలకు పంపించి పారిశుద్ధ్య నిర్వహణను చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయ సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయనతో పాటు కొర్లకోట ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ గురుగుబెల్లి వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

సైనికుడికి సత్కారం



ఈశ్వరరావు దంపతులను ర్యాలీగా గ్రామానికి తీసుకొస్తున్న దృశ్యం

పలాస: దేశ భద్రత కోసం సరిహద్దులో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన మద్దిల ఈశ్వరరావుకు శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఆయన పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి ఉద్యోగ విరమణ తర్వాత మొదటిసారిగా వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు ర్యాలీగా తీసుకొచ్చి, సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉప సర్పంచ్ వంకల మురళి, గ్రామ పెద్దలు సార జోగారావు, మురిపింటి కామయ్య, వంకల బాబూరావు, వంకల కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ పురుషోత్తకక్ర గ్రామంలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వాబ యోగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని, దీంట్లో పాల్గొనేవారు ఈనెల 9వ తేదీలోగా 99856 68114, 91214 42891,79952 32246 నంబర్లకు ఫోన్‌చేసి రూ.2 వేలు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను రాష్ట్ర కార్యదర్శి దువ్వారి చలపతి ఆధ్వర్యంలో ఎంఈవోలు గోవిందరావు, తిరుమలరావులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరిపురం సోమేశ్వరరావు, హరిబిస్వాల్, ఆపస్ సభ్యులు శ్యాంబాబు, మోహన్‌రావు, నాయక్, శ్రీనివాస్, బలరాం, రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలి

కొత్తూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సీడీపీవో విమల కుమారి సూచించారు. కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం నుంచి తీసుకెళ్తున్న గుడ్లు, పాలతో పాటు ఇతర ఆహార పదార్థాలు బాలింతలు, గర్భిణులు తినాలని సూచించారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కార్యకర్త పిన్నింటి లక్ష్మికి ఆదేశించారు.

సత్వరమే పరిష్కరించాలి

కొత్తూరు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని టెక్కలి ఆర్డీవో మడపాక కృష్ణమూర్తి ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రవిచంద్రతో పాటు వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. టెక్కలి డివిజన్‌లోని కొత్తూరు మండలం నుంచి రెవెన్యూ సదస్సులో ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. దరఖాస్తులు పరిష్కరించడంలో ఆలసత్వం వహించరాదన్నారు. అంతకుముందు ఆకులతంపరలో గత కొన్నేళ్ల నుంచి సమస్యతో ఉన్న తాగునీటి బోరును పరిశీలించారు. సమావేశంలో మండల సర్వేయర్ గవరయ్య, డీటీలు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత రాపాక

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రాపాక జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రాపాక జట్లు ప్రథమ స్థానం, ఎస్‌ఎం పురం జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి.